కథ 2001

4



# నిశ్శబ్ద విప్లవం

జి. ఉమామహేశ్వర్

'ఐ. టి. - ఎ సైలెంట్ రెవల్యూషన్.' కృష్ణమోహన్ కుర్చీ వెనగ్గా గోడమీద ఉన్న ఆ స్లోగన్‌ను గొణుక్కుంటున్నట్టుగా చదివాను.

"ఆ!" అన్నాడు ప్రక్కనే కూర్చున్న సంజన్న.

సంజన్నకి అర్థమయ్యేలా ఎలా చెప్పాలో తోచక- "ఈ కంప్యూటర్లు- ఇవన్నీ విప్లవాత్మకమైన మార్పులు తెస్తాయట," అన్నాను.

సంజన్నకి అర్థమయిందో లేదో తెలియదుగాని మరింక వివరణలు, కొనసాగింపులు అవసరం లేద న్నట్లు "ఉహూ!" అని ఊరుకున్నాడు. కృష్ణమోహన్ ఆఫీసులో అడుగు పెట్టినప్పటి నుండి వేరే ప్రపంచంలో ఉన్నామా అనిపిస్తోంది. అందమైన బిల్డింగు, నీట్‌గా అమర్చిన ఫర్నిచరు, క్యాబిన్లు, సెంట్రలైజ్డ్ ఎసి, ఎసి లోంచి సెంటు వాసనలు. అడుగుపెడితే మాసిపోతుం దేమోనన్నట్లు తెల్లని టైల్స్‌తో ఫ్లోరింగ్, అందరి ముందు కంప్యూటర్లు, ఫోన్లు, అందరికీ బూట్లు, టైలు- ఈ వాతా వరణంలో నేనూ, సంజన్న తెల్లటి పాలల్లో మరకలుగా కనిపిస్తున్నామేమో అనిపించింది. కాని సంజన్న ఇవేవీ పట్టించుకున్నట్లు లేడు. వచ్చేముందు ఆపేసిన కథను తిరిగి చెప్పడం ప్రారంభించాడు.

"వారమయింది. ఒక్క యిత్తనం గూడ మొలక రాలే. రెండు వారాలాయె, నెలాయె! ఏముంది మోసం. కల్తీ యిత్తనాలంట. మళ్లీ యిత్తుదామంటే గింజలేడుం టాయి? పోయినేడుదే సొసైటీ లోను కట్టలేదు. ఈ గుడ్డి గింజలు గూడ డబ్బులకే గద కొన్నాము. ఈ అప్పు దీర్చ కుంటె యాలాలేస్తామంటుంది గవర్నమెంటు. అరే- యాడైనా మోసం చేయొచ్చుగాని తిండిగింజలు పండించే రైతు కాడనా? నాకొక నూరిత్తనాలిచ్చినావంటే ఒక సంచి గింజలవుతాయి. మోసం చేసింది నన్నొక్కణ్ణే కాదుగదా- తిండి తినే అందర్నీ మోసం చేసినట్లు! ఒకట్రెండు ఎకరాలుండేటోళ్లు ఏం తట్టుకుంటారు? ఇంత పురుగుమందు తాగి సస్తారు. అట్లని నేనేం ఆసామిని కాదులే. అయినా సస్తాబోతే ఎవురికి లాభం? సావాల్సిన ఖర్మం పట్టించినోణ్ణి సంపాల. ఇత్తనాలు మంచివని సిఫారస్ చేసినోడి కళ్లు ఏమయినాయంట?

"ఆ నా కొడుకుల కాడ మూటకింతని డబ్బులైదె... కాన్లే కాన్లే. ఈ పొద్దు ముఖ్యమంత్రి యేసిన కమిటీ ఎంక్వయిరీ సక్రమంగ చేసిందంటే సరే. లేదంటే మా సెక్రట్రీగానికి, రుద్రగౌడకు, ఎమ్మెల్యేగానికి సింతపండు పడగొడతాము."

సంజన్న మాటల్లో పదునుకు, చూపుల్లో వాడికి నేనాశ్చర్యపోయాను. నైన్త్‌లోనో, టెన్త్‌లోనో ఎండాకాలం లో చెట్లకింద బడి పెట్టినప్పుడు సార్ కొట్టబోతుంటే చెట్టెక్కి రకరకాల విన్యాసాలు చేసి అందర్నీ కడుపుబ్బ నవ్వించేవాడు. చదువులో ఏమాత్రం ఆసక్తిలేదు. చదువుకోరా అంటే నాకివన్నీ ఎందుకు సార్- ఎట్లా నేను వ్యవసాయం చేసుకునేటోన్నే, చదవను రాయను తెలిస్తే చాలు- ఈ ఏస్క్వేర్లు, బీస్క్వేర్లు ఎందుకు- వడ్డీ లెక్కలు తెలుస్తే మా సొసైటీ వోళ్లు మోసం చేయకుండ చూస్కోవచ్చు! అనేవాడు.

"ఎట్లా నేను టెన్త్ పాస్ కాను. అది సెంట్ పర్సెంట్ గ్యారంటీ?" అని బలంగా నమ్మే సంజన్న స్కూల్‌కి రావడం 'ఫుట్‌బాల్' కోసమే. ఫుట్‌బాల్‌లో మా స్కూల్‌కి వచ్చిన గుర్తింపు సంజన్న వల్లనే!

''ఏం మురళీ ఎప్పుడొచ్చావు? సారీ ఫర్ బీయింగ్ లేట్? ఆ! అరె ఇక్కడ సంజన్నా! హౌ కం? ఏరా ఎట్లున్నావు? ఎన్నేళ్లయిందిరా నిన్ను చూసి! టెన్తయినాక కలవలేదు గదూ!'' అప్పుడే రూమ్‌లోకి వచ్చి సీట్లో కూర్చుంటూ పరామర్శించాడు కృష్ణమోహన్.

కృష్ణమోహన్ పలకరింపుకు ఇద్దరమూ ఈ లోకం లోకి వచ్చి- ''నాకు వంట్లో బాగలేక మూడ్నెల్ల లీవ్‌లో వున్నాను మోహన్! నా లీవ్ శాలరీ విషయం చిన్న గొడవ యింది. ప్రస్తుతం సెక్రటేరియట్లో వుంది. అక్కడికే వెళ్లి వస్తుంటే గేటు దగ్గర వీళ్లు ధర్నా చేస్తున్నారు. మనోడు ముందు వరుసలో వుంటే నేనే గుర్తుపట్టి పలకరించాను. మాటల్లో చెప్పాను. నువ్విక్కడే వున్నావని- సరే మళ్లీ రైలు రాత్రికే. అంతవరకు ఏం చేద్దాం? కలుద్దాంలే అన్నాడు. వెంటనే బయల్దేరి వచ్చాం,'' అన్నాను.

''మంచిపని చేశారు. ఏం తీసుకుంటారు పెప్సీ, కోక్!''

ఏమీ వద్దంటున్నా వినకుండా తనే వెళ్లి డిస్పెన్సర్ దగ్గర నుండి మూడు కోక్ బాటిల్స్ పట్టుకొని వచ్చాడు.

మౌనంగా బాటిల్ ఖాళీ చేసే ప్రయత్నంలో వుంటే కృష్ణమోహన్ అన్నాడు. ''సారీ! నేను వెడ్డింగ్ కార్డ్స్ పంపించలేకపోయాను. అస్సలు టైము లేదురా! నేను ఫిబ్రవరి 17న ఫ్లైట్ దిగాను. 21న పెళ్లి. మళ్లీ 28న వెళ్లిపోయాను. షి ఈజ్ ఎ నైస్ వుమన్.''

''ఎన్ని నెల్లు వున్నావక్కడ,'' ఏదో మాటలు కలపాలని అడిగాను.

''ఒన్నియిర్ త్రీమంత్స్! కానీ పెద్దగా ఏం సేవ్ చేసుకోలేకపోయానులే! ఎక్కడ ఈ పెళ్లికని వచ్చి పోయానా? పోగానే ఆమెకు వంట్లో బాగోలేదు. డాక్టర్ల ఫీజులు చాలా ఎక్కువ అక్కడ. ఏదో ఒక కారు కొన్నా! జూబ్లీహిల్స్‌లో ఫ్లాట్ తీశా! కర్నూల్లో కూడా ఒక ఇల్లు కడదామన్న ఆలోచన వుంది. నీ ఎరికలో ఏదన్నా వస్తే చెప్పు మురళీ! అన్నట్లు ఏం మాట్లాడవేందిరా?'' అన్నాడు సంజన్నవైపు తిరిగి.

''సంజన్న ఇప్పుడు రైతు నాయకుడు,'' సరదాగా అన్నాను.

సంజన్న కూడా తేలిగ్గా నవ్వేస్తూ-

''కడుపు మండితే ఎవురయినా నాయకులు కావాల్సిందే,'' అన్నాడు, ఫోన్ మోగింది.

అవతలి వ్యక్తితో ఏదేదో మాట్లాడిన తర్వాత, 'మధ్యాహ్నం రానని,' చెప్పాడు కృష్ణమోహన్. పేరుతో పిలిచినందువల్ల బహుశా ఫ్రెండేమో అనుకున్నా! కానీ మళ్లీ చెప్పాడు. వాళ్ల బాస్ అట. ఇక్కడ ఎవరూ ఎవర్నీ 'సార్, సార్,' అనరని, అందర్నీ పేర్లతోనే పిలుస్తారని తెలిసి ఆశ్చర్య పోయాను. నాకు మావాళ్లు వ్రాసే లీవ్ లెటర్లు గుర్తొచ్చాయి -

''మహారాజ రాజశ్రీ... గారి దివ్య సముఖము నకు... అర్ధదినము శెలవు మంజూరు చేయగలరని దొరవారికి మిక్కిలి విన్నవించుచున్నాను.

తమ విశ్వాసపాత్రుడు.''

''ఇక్కడ నీ ఉద్యోగం ఏందిరా?'' సంజన్న అడిగాడు.

''ఇంతకు ముందు 'వైటుకె'లో వుండేవాడిని. అప్పుడే అమెరికాకు గూడా పోయొచ్చింది. ఇప్పుడు ఒరాకిల్ మీద చేస్తున్నా,'' అన్నాడు.

సంజన్నకేమీ అర్థం కాలేదు. నాకూ సరిగ్గా అర్థం కాలేదు. కృష్ణమోహన్ చెప్పాడు.

''ఆర్టీసీ బస్ రిజర్వేషన్లు, హాస్పిటల్లో బిల్లులు చూసి వుంటారు గదా. ఇట్లాంటివే కొన్ని ప్రాజెక్టులు వుంటాయి. ఊరికే ఇట్లా కీబోర్డు ప్రెస్ చేస్తే మొత్తం డీటెయిల్స్ అన్నీ రావాలన్నమాట. అట్లా రావాలంటే చాలా పని చేయాల. నావరకు నేనయితే కోడింగ్ చేయాల. ఒక్కో మాడ్యులు తీసుకోవడం- దాన్ని కంప్యూటర్ కోడ్‌గా రాయడం,'' ఇదీ పని.

వచ్చినప్పట్నుంచీ నేను మనసులో అంచనా వేస్తున్న విషయాన్ని సంజన్న నేరుగా అడిగాడు- ''అవును మోహనూ- నీ జీతమెంతుంటుంది. ఓ పదివేలన్నా వుండదా?''

కృష్ణమోహన్ కించిత్ గర్వంతో నవ్వాడు. అమాయకపు ప్రశ్న వేసినందుకు సంజన్న అజ్ఞానానికి జాలిపడినట్లు నవ్వాడు. నవ్వుతూనే చెప్పాడు-

''మా ఆఫీసులో పదివేలకి ఉద్యోగాలే లేవు,'' అన్నాడు. అని, ''నేను అమెరికాకు పోకముందు ఇరవై వుండేది. ఇప్పుడు ఫారిన్ రిటర్న్డ్ గదా. ప్రస్తుతం ముప్పై ఎనిమిది వేలు వస్తుంది. ఎక్కువ తక్కువ మాట్లాడితే ఎక్కడ వేరే కంపెనీకి వెళ్లిపోతామేమోనని భయం. ఎక్స్‌పీరియన్స్ పెరిగే కొద్దీ జీతం పెరిగిపోతుంటుందలా. అదిగో ఆ ఎదురుగా కూర్చున్నాడే- వాడొక ప్రాజెక్ట్ లీడర్. వాడి జీతం అరవై వేలు,'' అన్నాడు.

''ముప్పై ఎనిమిది,'' దగ్గర నా గుండె లయ తప్పింది. నేను ఇరవై దగ్గర అంచనా వేస్తే, దాదాపు దానికి రెట్టింపు సంపాదిస్తున్నాడు.

''నెలకేనా,'' అనుమానంగా అడిగాడు సంజన్న. మళ్లీ తనే- ''ఏం చేస్తావురా అంత డబ్బు? ఇంటికేమన్నా పంపిస్తావా?'' అడిగాడు.

"నిజం చెప్పాలంటే మిగిలిస్తున్నదేం లేదురా! అంతా ఖర్చయిపోతుంది. డబ్బులొస్తాయన్న మాటేగాని నెలాఖరయిందంటే మళ్లీ శాలరీ కోసం ఎదురు చూడాల్సిందే!"

మేం నమ్మడం లేదన్న భావాన్ని మా ముఖాలు చెప్పాయేమో- "ఎక్కడ్రా ఇక్కడ ఇల్లే నాలుగైదు వేలవుతుంది. నేను ఫ్లాటు కొన్న తరువాత ఇంటి అద్దె లేదనుకో. కాని మెయింటెనెన్స్ వుంటుందిగా! ఇక్కడ దాదాపు ప్రతినెలా ఏదో ఒక కారణంతో పార్టీ ఇవ్వాల్సొస్తుంది. ఇంతకు ముందు బీరనే వాళ్లు. ఇప్పుడు 'ఆప్‌కి ఫర్‌మాయిష్' అన్జెప్పి ఎవడికి నచ్చింది వాడికి తాపాలి. నెలకోరోజు 'డ్రయిన్ అవుట్' అని పిక్‌నిక్ వేస్తారు. దానికయ్యే ఖర్చులు. వారానికో రోజు 'వెట్ డే' అని వుంటుంది. ఎంత కావాలంటే అంత తాగొచ్చు. నెలకింత శాలరీలో కట్ చేస్తారు. ఇంక కారొకటుంది కదా! దాని మెయింటెనెన్స్. అట్లాగే నెలకొక డ్రస్ ప్రెజెంట్ చేయాలి తనకి. ఇక గిఫ్ట్‌లని, షోకేజ్ అయిటమ్స్ అని, హోటల్స్ అని, అవనీ ఇవనీ... ఇంతే. ఎంత చెట్టుకి అంత గాలి! చివరికి ఏ వెయ్యో, రెండువేలో మిగిల్తే అంత చిన్న అమౌంట్ ఇంటికేం పంపిస్తాంలే... అనుకుంటు... ఇలా గడుస్తుంది."

ప్రపంచంలోని బాధలన్నీ తననే చుట్టుముట్టినట్లు, కష్టాలన్నీ తనే అనుభవిస్తున్నట్లు వర్ణించాడు కృష్ణమోహన్.

నా నాలుగువేల జీతాన్ని దానికి పదిరెట్లయిన నలభైవేల కృష్ణమోహన్ జీతాన్ని బేరీజు వేసుకుంటూ కూర్చున్నాను.

సంజన్న ఏమీ తోచక- "ఇది కంప్యూటరా? ఏమేం చేస్తుందిది," అనడిగాడు.

కృష్ణమోహన్ తమాషాగా నవ్వి, "ఏం చేయలేదో చెప్పాలి," అని ఏదో ఆలోచించి-

"నీకు బాలకృష్ణగాడు గుర్తున్నాడా," అనడిగాడు.

"క్లాసులదిరిపోయేలా లొట్టలేసేవాడు- ఆ లొట్టలయ్యేనా?"

"ఆ వాడే! ప్రస్తుతం అట్లాంటాలో వుంటున్నాడు. మొన్ననే మెయిల్ ఇచ్చాడు," అన్నాడు. అని ఓ మూడు నాలుగు నిమిషాలు ఏవేవో 'కీ'లు నొక్కి స్క్రీన్‌ను నా ముందుకు జరిపాడు. అందులో బాలకృష్ణ, కృష్ణమోహన్‌కు వ్రాసిన ఉత్తరం వుంది. కృష్ణమోహన్ సంజన్నవైపు చూస్తూ, "నువు మీ వూర్నించి కర్నూలుకు జాబు వ్రాస్తే ఎన్నాళ్లకు పోతుంది?" అనడిగాడు.

"రెండ్నాళ్లయినా పడుతుంది."

"ఎక్కడో అమెరికాలో అట్లాంటాలో ఉన్న బాలకృష్ణగాడు వ్రాసిన జాబు ఒక్క నిమిషంలోనే హైదరాబాద్‌లో వున్న నాకు చేరింది. అదే కంప్యూటర్ మహిమ," అంటూ నావైపు తిరిగి, "ఈ-మెయిల్," అన్నాడు.

నాకు పదో తరగతి రోజులు గుర్తొచ్చాయి. నేను, కృష్ణమోహన్, బాలకృష్ణ పోటాపోటీగా చదివేవాళ్లం. ఒక్కళ్లకే ఫస్ట్ మార్క్ వరుసగా రెండుసార్లు వచ్చేది కాదు. ఇంటరయ్యాక నాన్నగారు పోవటంతో ఇంటిబాధ్యతలు నెత్తిన పడటం, కంపాషనేట్ గ్రౌండ్స్‌లో నేను జూనియర్ అసిస్టెంట్‌గా చేరడం- తర్వాత డిగ్రీ, పి.జి. చేయడం- చేసినా స్థాయి పెరగకపోవడం జ్ఞాపకాలు అన్నీ చెదురు మదురుగా బ్యాక్‌గ్రౌండ్‌లో దొర్లిపోతున్నాయి.

కృష్ణమోహన్ చెప్పుకుంటూ పోతున్నాడు.

వాళ్లకి ఆఫీసు పనులకు వెహికిల్ ఇస్తారని, ఫ్రీగా ఫోన్ కనెక్షన్ ఇచ్చారని, ఆఫీసులో ఉంటే ఫ్రీ లంచ్ ఇస్తారని, బయటికెడితే యాభై రూపాయలు లంచ్‌కిస్తారని, సాయంత్రం ఆఫీసు అవర్స్ తరువాత రెండు గంటలుంటే ఓ.టి. ఇస్తారని, ఈవెనింగ్ స్నాక్స్ ఇస్తారని, ఏడు తరువాత ఉంటే నైట్ డిన్నర్ కూడా ఇస్తారని- మెడికల్ ఖర్చులిస్తారని, సంవత్సరానికోసారి టూర్ అలవెన్స్ ఇస్తారని, ప్రాజెక్టు పూర్తవగానే అప్రిసియేషన్ కింద కొన్ని వేలు ఇస్తారని... చెప్పుకుంటూ చెప్పుకుంటూ...

"ఇంటర్‌నెట్ చూస్తావా?" అనడిగాడు.

దాన్ని గురించి వినడమే కాని చూడలేదు. నా సమాధానం కోసం ఎదురుచూడకుండా కీబోర్డు మీద ఏవేవో టైపు చేసి-

"ఇదిగో మీ గవర్నమెంటు సైటు" అన్నాడు. చూస్తే- 'andhrapradesh.com' అనే హెడ్డింగు కింద రాష్ట్ర పటం వేసి- అన్ని డిపార్ట్‌మెంట్‌ల పేర్లు ఉన్నాయి.

"వీటికంతా లింక్స్ వుంటాయి. ఏది కావాలంటే అది సెలెక్ట్ చేసుకోవచ్చు," అన్జెప్పి సంజెన్న వేపు తిరిగి,

"ఇవేకాదు. పచ్చి బూతుబొమ్మలు కూడా వుంటాయి. ఇక్కడ బాగుండదు. ఇంటికెళ్లాక చూపిస్తాను," అన్నాడు.

ఆ తరువాత వాళ్లు బిల్స్ ఎలా క్లయిమ్ చేస్తారో చూపించాడు. పేరు, కిలోమీటర్లు, ఛార్జీ అన్నీ టైపు చేయగానే స్క్రీన్ మీద ఒక నెంబరు, దాని కెదురుగా రూ. 1,850/- అని వచ్చింది. "ఈ నెంబరు చెబితే చాలు డబ్బులిచ్చేస్తారు," అన్నాడు. నాకు మా ఆఫీసు ప్రొసీజర్ గుర్తొచ్చింది. నవ్వుతూ చెప్పాను.

"మా ఆఫీసులో రెండేళ్ళ క్రితం బిల్స్ ఇప్పుడు చేస్తుంటాము."

"ఇప్పుడు నేను క్లయిమ్ చేసింది నిన్నటి ట్రిప్‌ది. ఇప్పుడు మనం పోయేటప్పుడు తీసుకుని పోవచ్చు. అందుకేరా ఐటి ఈజె సైలెంట్ రెవల్యూషన్- నిజం నాకు భలే నచ్చిన కొటేషన్ అది," అంటూ సొరుగు తీసి తన కుర్చీ వెనుక తగిలించిన బోర్డు లాంటిదే నాకొకటి ఇచ్చాడు. తెల్లని ప్లాస్టిక్ ఫ్రేం మీద నీలం రంగుతో వ్రాసింది, 'ఐటి- ఎ సైలెంట్ రెవెల్యూషన్,' అని. తీసి బ్యాగులో వేసుకున్నాను.

"పదండి లంచ్ కెళ్దాం- మా ఆఫీసులో చేద్దామా? బయటకెళ్దామా? బయటకే వెళ్దాం పద," అంటూ బయల్దేరదీశాడు.

ఓ ఖరీదైన హోటల్‌కి తీసుకెళ్లాడు. ఏమేం తిన్నామో, తెలీదుగాని బిల్లు మాత్రం మూడువందల పైనయింది. దాన్ని తను పే చేస్తానని చెప్పాడు కృష్ణ మోహన్. అలా చెప్పడంలో, 'తను మాత్రమే పే చేయ గలననే,' ధ్వనిని గమనించాను. ఆ తర్వాత సినిమా కెళదామన్నాడు. కానీ సంజన్న పార్టీ ఆఫీసుకెళ్లాలని, నేను మళ్లీ ఓసారి సెక్రటేరియట్ కెళ్లాలనడంతో మమ్మల్ని డ్రాప్ చేసి తానొకడే వెళ్తానని అన్నాడు. వాళ్లావిడ ఊర్లో లేదని, లేకపోతే ఇంటికి పిల్చుకు వెళ్లి పరిచయం చేసుండేవాడినని చెప్పాడు. ఈసారి హైద్రా బాద్ వస్తే ఖచ్చితంగా కలిసే వెళ్లమని చెబుతూ విజిటింగ్ కార్డులిచ్చి మమ్మల్ని సెక్రటేరియట్ దగ్గిర డ్రాప్ చేసి వెళ్లిపోయాడు.

కర్నూలుకొచ్చి వారమైనా కృష్ణమోహన్ ఆఫీసు తాలూకు జ్ఞాపకాలు వదలడంలేదు. మా ఆఫీసులో ఏ సంఘటన జరిగినా దాన్ని కృష్ణమోహన్ ఆఫీసుతో పోల్చుకోవడంతో అది మరీ ఎక్కువయింది. భోంచేసి, పిల్లల్ని నిదురపుచ్చి మంచం మీద పడుకున్నాను. రాత్రి పదిన్నరవుతోంది.

ఒకటే ఆలోచనలు-

కృష్ణమోహన్ మాటల్లో అన్నాడు- "ఫోన్ నెంబ రుందా! అప్పుడప్పుడు ఫోన్ చేస్తుంటాను." తలచు కుంటే నవ్వొస్తుంది.

"ఫోన్ లేదా! పోన్లే ఇదిగో ఈ నెంబర్‌కు చేస్తుండు." ఇదింకా భారం.

'హు! ఏం బతుకులు!'

'ఎందుకిట్లా జరుగుతోంది? నేను చేసిన పాప మేంటి? వాడి గొప్పదనమేమిటి? ఎవరికీ ఏ అనా రోగ్యమూ లేకుండా నెల గడిస్తే 'హమ్మయ్య' అని ఊపిరి తీసుకోగలుగుతాను. గవర్నమెంటు పెంచే డి.ఎ. కోసం ఆతృతగా ఎదురుచూస్తుండటం- సంవత్సరం ఎప్పుడయిపోతుందా, ఇ.ఎల్. ఎన్‌క్యాష్ చేసుకోవచ్చా! అని ఆశపడటం.'

ఛఛ ఇంత కటకటగా నా బతుకీడుస్తుంటే-

ఐశ్వర్యంలో తేలుతూ, తూలుతూ గడుపు తున్నాడు వాడు. కర్నూల్లో మూడు సెంట్ల స్థలం కొందామని ప్రతిసారీ అనుకోవడమూ, జీతం పెరిగిన ప్రతిసారీ ఏదో ఒక అవసరం రావడమో, జీతం పెరగ్గానే దానికి తగ్గట్టుగానే ఖర్చులు పెరగడమో... అలా అలా వాయిదా పడుతూనే ఉంది. అలాంటిది- వాడెంత అవ లీలగా అన్నాడు. 'ఏదన్నా మంచి స్థలం చూడరా కర్నూల్లో గూడా ఇల్లు కడదామనుకుంటున్నాను.'

'మనిషి పోయాక కావల్సింది ఆరడుగులే,' ఎవరో అన్న వేదాంతపు మాటలు గుర్తొచ్చాయి.

సరేలే! పోయినప్పుడు ఆరడుగులయినా, ఉన్న ప్పుడు కనీసం ఉండటానికో ఇల్లు కావాలి. కానీ హైద్రా బాద్‌లో ఒకటి- కర్నూల్లో ఒకటి. ఒకవైపు రెండు ఇళ్ల ఓనరు- మరోవైపు రెంట్లు కడుతూ నేను. ఒకవైపు తెల్లగా మెరిసే మారుతి. మరోవైపు పాతకాలపు సైకిలు. ఒకవైపు నలభైవేల కృష్ణమోహన్. మరోవైపు నాలుగువేలతో నేను. ఎందుకింత భేదం. ఇక సమసమాజం అన్న మాటలు నీటిరాతలేనా? ఈ మూడేళ్లలో ఎంత మార్పు! ఎలా? కంప్యూటర్ల వల్లేనా?

నలభైవేలు కట్టి ట్రైనింగ్ తీసుకుని పై స్థాయి కెళ్లాడు కృష్ణమోహన్.

ఆ అవకాశం అందరికీ వస్తుందా?

అందులో నాలాంటి దైవోపహతుడికి!

అయినా ఎందుకింత పోలిక? ఇదిక్కడతో ఆగుతుందా!

ఉహూ! మెల్లగా కృష్ణమోహనంటే అసూయను కలిగిస్తుంది. వాడెంత మంచిగా మాట్లాడినా అందులో వెక్కిరింత కనబడుతోంది. అది దృష్టిలోపమా? నిజమా? అసూయపడినా తప్పేముంది?

ఎస్టాబ్లిష్‌మెంట్ క్లర్కంటే ఎంత రెస్పాన్సిబిలిటీ! ప్రతిరోజూ ఉదయం పది నుండీ రాత్రి ఏడెనిమిది వరకూ ఆఫీసే సరిపోతుంది.

ఇంత వర్కు చేస్తున్నా కాఫీనీళ్లకి గతుండదు. ఇంక ఓ.టీ.ల గురించి, నైట్ డిన్నర్‌ల గురించి ఏమా లోచిస్తాం.

"నీ సీటు సంపాదించుకునే సీటు," అంటాడు సూపరింటెండెంట్ సిగ్గు లేకుండా.

'సంపాదించుకోలేకపోతే నీ ఖర్మ' అన్నట్లుంటుంది ఆయన ప్రవర్తన. ఆఫీసులో పనిచేసే కొలీగ్స్ లీవ్ శాలరీస్‌లో, ఎన్‌క్యాష్‌మెంట్లో, టి.ఏ. బిల్లులో పర్సంటేజ్‌లు వసూలు చేసే దుర్మార్గుడు. కానీ వాడంటేనే ఆఫీసరుకు అభిమానం. చాలా బాగా డీల్ చేస్తాడని కితాబు కూడా ఇస్తాడట. పైరవీలకీ, పైసలకీ ఆయన కావాలి. ఆఫీసుపనికి చాకులాంటి తను కావాలి. ఇక్కడ ఈ కుళ్లు రాజకీయాల్లో, ఈ మురికి కూపంలాంటి ఆఫీసులో సతమతమవుతూ తనుంటే- అక్కడ ఉల్లాసంగా, ఉత్సాహంగా సీతాకోకచిలుకలాగా కృష్ణమోహన్. తను చేసే ఉద్యోగం కృష్ణమోహన్ చేసే కోడింగ్ కంటే క్లిష్టమైనదే- కాని గుర్తింపేదీ?

పదో తరగతి వరకూ- ఇద్దరమూ ఒకే గాడిలో వున్నాము.

పదేళ్లలో ఎంత మార్పు! తనో సంసార పెద్దగా సాలెగూడులో చిక్కి విలవిలలాడుతున్నాడు.

కృష్ణమోహన్ సరదాగా, హుషారుగా, విలాస పురుషుడిగా తిరుగుతున్నాడు. పదేళ్లయినా ఎక్కడ? ఇంజనీరింగ్ అయిన మూడు నాలుగేళ్లు ఏదో ప్రైవేటు కంపెనీలో నాలుగైదు వేలకు పనిచేశాట్ట. ఈమధ్యే ఇదిగో ఈ కంప్యూటర్లొచ్చి-

మూడు నాలుగేళ్లలో కొద్దిమందిని అపర కుబేరుల్ని చేశాయి. నలభైవేలు కట్టి ట్రైనింగ్ తీసుకొని ఝామ్మని పెద్ద కంపెనీలో చేరిపోయి ఈరోజున నలభైవేలు నెలకు సంపాదిస్తున్నాడు.

నలభైవేలు! తన పదినెలల జీతం-

నాలుగువేలతో బ్రతికే ఆరుమంది గల తన కుటుంబం-

నలభైవేలతో కృష్ణమోహన్, వాడి భార్య!

ఎక్కడి సమానత్వం? ఒక దేశంలో, అదీ ఒక రాష్ట్రంలోనే ఇంత పెద్ద ఆర్థిక వ్యత్యాసాలుంటే ఇక సమసమాజం మాటెక్కడిది? ఈ కొత్త కుబేరులు అక్కడితో ఆగుతారా?

వీళ్ల ఆదాయం ఎక్కువ- అలవాట్లు, అభిరుచులు మధ్యతరగతివే! సామాన్య మధ్యతరగతి మానవుడికి అందుబాటులో వున్నవన్నీ వీళ్ల పుణ్యమా అని ధరలు పెరిగి కూర్చుంటాయి.

ఈ పరిస్థితులకంతటికీ కంప్యూటర్లే కారణమా? అయితే వాటివల్ల ఎవరికి ఉపయోగం?

సెక్రటేరియట్ నిండా కంప్యూటర్లే- కాని నా ఫైలు మీద సంతకం కావాలంటే సెక్షన్ ఆఫీసర్ నా అశక్తతని సొమ్ము చేసుకుంటున్నాడు.

ఉన్నవాళ్లని మరింత కలవారిగా చేయడం- లేనోణ్ణి మరింత బీదవాడిగా చేయడం తప్ప వీటికి వేరే ప్రయోజనం ఏముంది? నా పరిస్థితే ఇలా వుంటే మరి రైతుల మాటేమిటి?

ఎంత కష్టపడితే వాళ్లకి పూట గడుస్తోంది. ఆలోచనలు ఎక్కడికో ఎక్కడెక్కడికో వెళుతున్నాయి.

అలసటతో కళ్లు మూతపడి నిద్రలోకి జారుకొంటున్నకొద్దీ- అవి అలా అలా మనసులోకి ఇంకిపోతున్నాయి. అన్నీ సర్దుకుని తలుపులకు తాళాలేసి పక్కనే తనొచ్చి పడుకున్న అలికిడి. కళ్లు తెరవలేకపోతున్నాను.

"రేయ్! ఎవర్రా లోపల- బయటకు రండ్రా. ఒక్కొక్క నా కొడుకుని చీలుస్తా అట్లే- నా కొడుకుల్లారా! సల్లగ అద్దాల మేడల్లో కులుకుతున్నార్రా- రండి బయటికి," గట్టిగా అరుస్తున్నారు.

పరిచయమైన గొంతు- బాగా విన్నట్లు జ్ఞాపకం!

"కంప్యూటర్లు కాదురా కడుపుకింత తిండి గావాల!" మెల్లమెల్లగా ఆ ఆకారాన్ని పోల్చుకోగలుగుతున్నాను.

"మేమే రైతులు, మేమే కూలీలై ఎండల్లో, వానల్లో ఎట్ల వాటంబడితే అట్ల కష్టపడితే- అందరూ మమ్మల్ని మోసం చేసే నా కొడుకులే!"

ఆ! వీడు- వీడు- సంజన్న.

వెనుక వందలమంది, అహా! వందలేనా, వేలమంది జనం- పిడికిళ్లు పైకెత్తి సంజన్న మాటలకు జై కొడుతున్నారు.

"ఒక్కని కంటె ఒక్కనికి ఔ! వీడు కష్టపడుతున్నాడనే విశ్వాసమైనా వుందా? సొసైటీ సెక్రటరీలు యేలిముద్రలు వేయించుకొని పానాలు కుదవకు బెట్టుకుంటారు- వాడు బోయి సూపర్‌వేజరుకు, మేనేజరుకు ఇట్లా అందరు మా శవాల మీద పైసలేరకతినే నా కొడుకులే! మేము పురుగుల మందు తాగి సచ్చేసావేంది? మీరు కొవ్వుబట్టి మందుగొట్టి కులికేదేంది. రాండ్రా! నా కొడుకుల్లారా! తింటే అందరం అన్నం తిందాం, లేకుంటే గంజి తాగుదాం."

చింతనిప్పుల్లాంటి సంజన్న కళ్లు ఆ భవనాన్ని తగులబెడతాయోనన్నంత భయంకరంగా ఉన్నాయి. కోరమీసం కొడవలిని గుర్తుకు తెస్తోంది.

"నెలకు నలభై, యాభైవేలు సంపాదించేవోడు అమెరికాకి పైస లేకుండా ఉత్తరం వ్రాసుకోవచ్చంట- మేం పిచ్చినాకొడుకులమయి అద్రూపాయికి కార్డు కొనుక్కోవాల. ఇదేం న్యాయం- ఇవన్నీ కనిపెట్టేది డబ్బున్నోళ్ల కోసమేగాని మనలాంటి బక్కోళ్ల కోసం కాదురా! చూస్తావేందిరా," చివరి మాటలో ఏం ఆజ్ఞను గ్రహించారో- అద్దాలమేడ భళ్లుమంది. అందులోని ఎం.డి. చెంప చెళ్లుమంది.

"నీకెంతరా జీతం?" వీరభద్రుడు దక్షుణ్ణి అడుగుతున్నాడు.

"ఫైవ్ పర్సెంట్ ఆఫ్ ది ప్రాఫిట్."

"తెలుగులో కుయ్‌రా!"

"ఐదుపైసల భాగమంటన్నా!" ఎవరో అందించారు.

"అట్లొద్దు రూపాయల్లో చెప్పు," గద్దించాడు.

"రెండు లక్షలు."

చొక్కా కాలర్ రెండుచేతులతో పట్టుకుని ముందుకీ వెనక్కి ఊపేస్తూ ఉన్నట్లుండి గొంతు జీర బోతుంటే దాదాపు ఏడుస్తున్నట్లుగా అడిగాడు సంజన్న.

'రెండు లక్షలు! రెండు లక్షలు!! ఒరేయ్ ఇంత సంపాదిస్తున్నావు. ఏ పొద్దయినా మా గురించి ఆలోచించినావా? నేను గుండె మీద ధైర్యంగా చెయ్యేసుకుని చెప్తాండ- నేను నీ కోసం వడ్లు పండిస్తాండ- బేళ్లు పండిస్తాండ- నీ తిండి మొత్తం ఇదిగో ఈ నా పిచ్చినా కొడుకులు పండించిందేరా? చెప్పరా! చెప్పు! నువ్వు గూడ గుండె మింద చెయ్యేసుకుని చెప్పు- నువ్వు మా కోసం ఏం చేసినావు? చెప్పరా చెప్పు! చెప్పు!" ఆవేశంతో ఊగిపోతున్నాడు.

"ఏం చెబుతావురా? ఏం చేసినావని చెబుతావు- పోరా- ఫో," ఆ వ్యక్తిని వెనక్కి జనంలోకి విసిరేస్తూ ముందుకెళుతున్నాడు.

ఎవరికి వారు భయపడి చెల్లాచెదురై పారిపోతున్నారు. కంప్యూటర్లన్నీ కింద పడుతున్నాయి. పగిలిపోతున్నాయి. ఎవరూ పట్టించుకోవట్లేదు. వాటిని తొక్కుకుంటూ, దాటుకుంటూ ఎటుబడితే అటు దార్లు వెతుకుతున్నారు.

ఇంకోణ్ణి పట్టుకున్నాడు సంజన్న- "ఏంరా! మీకు వారానికొకసారి ఫుల్లుగ తాగకపోతే నిద్రపట్టదా? ఎవడబ్బ సొమ్మని కులుకుతున్నార్రా? మీరు తాగేది మందుకాదురా! అది మా రక్తం. మా రక్తం తాగుతున్నార్రా! ఇంతమంది గొప్పోళ్లు, పెద్దోళ్లు, సదువుకున్నోళ్లు కనిపెట్టిన ఈ కంప్యూటర్లో బూతుబొమ్మ లెట్లొచ్చినయ్‌రా? చెప్పు, చెప్పరా!" వాడి దవడ అదిరిపోయింది. సున్నితంగా చేతులతో కీబోర్డును, కాలితో యాక్సిలేటర్‌ను నొక్కడం తప్ప ఎలాంటి కష్టమూ తెలియనివాడు తూలుకుంటూ ముందుకెళ్లిపడ్డాడు. ఎదురుగా కృష్ణమోహన్! సంజన్న ఆగలేదు.

"ఏరా ఎచ్చుల్నాకొడకా- నీకోపూట భోజనం నూర్రూపాయలా? ఇరవై రూపాయల భోజనం తింటే అరగదేంరా? పదైదు రూపాయలు పెట్టి నీళ్ల బాటిలు కొనుక్కుంటాడు- మేమీడ పారే కాలువ నీళ్లు దోసిళ్లతో తాగుతున్నాముర! ప్రాణాలు ఎట్టికొచ్చినాయి- మీవి ఖరీదైనవా? నలభైవేలు సంపాదిస్తా, అది సరిపోదంటున్నావంటే నీ బడాయి బతుక్కింత అగ్గిబెట్ట! కనీసం కన్నోళ్లకి పంపియ్యనోడివి నువ్వుండేమి ప్రయోజనంరా? చావు. చావు ఫో!"

"సంజన్నా! కంట్రోల్ కంట్రోల్ వీడు మన కృష్ణమోహన్."

"ఎవడయితేనేం రా! డబ్బులెక్కువై బలిసిన్నాకొడుకెవడైతేనేం! ఒరేయ్ కృష్ణమోహన్ వీణ్ణి చూడరా! గుమాస్తాగిరి చేస్తా తమ్ముణ్ణి సదివించినాడు- చెల్లెలు పెండ్లి చేసినాడు. ఒక్క పైసా లంచం ముట్టలేదు. నాలుగు వేలతో ఎట్ల బతుకుతున్నాడో చూడ్రా! ఒరేయ్ వీడి కాలి కింద దూరాల్రా నువ్వు! తెలుసునా!"

కృష్ణమోహన్ బిక్కచచ్చిపోయి, చూపులు దిగిపోయి నిలుచున్నాడు.

"వీడికి తిండి ఫ్రీ, ఖర్చులు ఫ్రీ, ఫోను ఫ్రీ, కారులో పెట్రోలు ఫ్రీ! ఏం ఉద్ధరిస్తున్నానవని నీకివన్నీ ఉద్దరగ రావాల్రా? ఎవరికి మేలు చేస్తున్నావు?" పళ్లు బిగబట్టి పక్కనే వున్న కీబోర్డుని తీసి కృష్ణమోహన్ పైకెత్తాడు.

ఒక్కక్షణం ఒక్కక్షణం లేటైనా కృష్ణమోహన్ తల పగిలేదే-

"వద్దు- వద్దు, వద్దురా! ఆగు..." కళ్లు తెరిచాను.

నుదుటి నిండా చెమటలు పట్టాయి. కలవరింతకు అప్రయత్నంగానే ఆవిడ చేతులు నా వీపు మీద ధైర్యం చెబుతున్నట్లు నిమిరాయి.

ఎదురుగా బెడ్‌లైట్ కాంతిలో మెరుస్తూ కనబడుతోంది. కృష్ణమోహన్ ఇచ్చిన ప్రెజెంటేషన్ బోర్డ్- అక్షరాలతో సహా!

"ఐటి - ఎ సైలెంట్ రెవల్యూషన్."

*ప్రజాతంత్ర వర్తమాన సాహిత్య ప్రత్యేక సంచిక, మార్చి 2001*